క్లుప్తంగా

సర్పంచ్ గంగాధర్‌కు డాక్టర్ గణేష్ పరామర్శ



రేపల్లె రూరల్: కామరాజుగడ్డ నార్త్ పంచాయతీ సర్పంచ్ ఉయ్యూరు గంగాధరరావు ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడి చికిత్స పొందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ గురువారం గంగాధర్‌ను కలిసి పరామర్శించారు. ఆయన ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకుని గంగాధర్ కుటుంబానికి అండగా ఉంటానని హామీనిచ్చారు. పరామర్శించిన వారిలో పార్టీ రేపల్లె రూరల్, చెరుకుపల్లి మండల కన్వీనర్‌లు మేడికొండ అనిల్, దుండి వెంట రామిరెడ్డి, నాయకులు బొర్రా శ్రీనివాసరావు, ఉయ్యూరు కిట్టయ్య తదితరులున్నారు.

విజేతలకు బహుమతులు అందజేత



నిజాంపట్నం: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండలంలోని అడవులదీవి పంచాయతీ వీరంకివారిపాలెం రామమందిరం వద్ద గ్రామ పెద్దల ఆధ్వర్యంలో బుధవారం రాత్రి మహిళలకు ముగ్గులు, ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ యార్లగడ్డ వెంకట రాంబాబు విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. నాయకులు యార్లగడ్డ మదన్‌మోహన్, గ్రామ పెద్ద వీరంకి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌ఆర్టీఐ బాపట్ల జిల్లా మహిళ అధ్యక్షురాలిగా రిషిత



బాపట్ల: ఫోరమ్ ఫర్ ఆర్టీఐ బాపట్ల జిల్లా మహిళాధ్యక్షురాలిగా బి.విజయ రిషితను నియమిస్తున్నట్లు జాతీయ అధ్యక్షుడు ప్రత్తిపాటి చంద్ర మోహన్ ప్రకటించారు. జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజక వర్గాలకు మహిళా అధ్యక్షులు నియామకం చేపట్టి, జిల్లా కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలో విద్య, పోలీసు, మహిళా, రెవెన్యూ తదితర రంగాలలోని అధికారులకు, ప్రజలకు, ముఖ్యంగా అణగారిన వర్గాల ప్రజలకు సమాచార హక్కు చట్టం, హ్యూమన్ రైట్స్, లోకాయుక్తపై అవగాహన కల్పించేవిధంగా త్వరలో విధానం రూపొందిస్తామని తెలిపారు. మహిళల హక్కులు కాపాడుటం కోసం ఎఫ్‌ఆర్టీఐలో పురుషులతో సమానంగా మహిళలకు స్థానం కల్పించడం జరుగుతుందని స్పష్టం చేశారు.


శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం

భట్టిప్రోలు (కొల్లూరు): శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం మండలంలోని అద్దేపల్లిలో గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. 74వ శ్రీరామ నామస్మరణకోటి మహోత్సవాలను పునస్కరించుకొని అద్దేపల్లికి చెందిన శ్రీరామ నామస్మరణ ఆధ్యాత్మిక సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు కొన్నిపాటి భాస్కరరావు పర్యవేక్షణలో జరిపిన వేడుకలలో భాగంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పట్టాభిషేక మహోత్సవాన్ని తిలకించారు. ఈసందర్భంగా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలతోపాటు, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు.

భట్టిప్రోలు కో-ఆప్టెడ్ సభ్యుడిని తొలగిస్తూ ఆదేశాలు

భట్టిప్రోలు (కొల్లూరు): మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలకు గైర్హాజరవుతున్న కారణంగా భట్టిప్రోలు కో-ఆప్టెడ్ సభ్యుడిగా తొలగింపునకు జెడ్పీ సీఈఓ స్పీకింగ్ ఆర్డర్స్ ఇచ్చినట్లు ఎంపీడీఓ ఎస్‌పీ రమణ గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. వరుసగా మూడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలకు కో-ఆప్టెడ్ సభ్యుడు మహ్మద్ ఫిరోజ్ హాజరుకాని కారణంగా ఈ ఆదేశాలు వెలువడినట్లు ఆయన తెలిపారు. గత డిసెంబర్ 12న జరిగిన మూడోవ సర్వసభ్య సమావేశానికి ఆయన గైర్హాజరవడంతో, అదే నెల 13 నుంచి కో-ఆప్టెడ్ సభ్యుడిని పదవి నుంచి తొలగిస్తూ ఆదేశాలు అందినట్లు పేర్కొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



బాపట్ల: పట్టణంలో ఎక్కడైనా చెత్తచెదారం కనిపిస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథ రెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని వివేకానంద కాలనీ, విజయలక్ష్మీపురంలో గురువారం పర్యటించారు. పట్టణంలో పారిశుద్ధ్య పనులతోపాటు సిమెంటు రోడ్డులో గుంతలను పూడ్చేపనులను పరిశీలించారు. అనంతరం అన్నా క్యాంటీన్‌లో ఆహార పదార్థాల రుచిని పరిశీలించారు. కమిషనర్‌తోపాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు డి.శ్రీనివాసరావు, కరుణ ఉన్నారు.

తాగునీరు.. వృథాగా పారు!



మార్కెట్ సెంటరులో వృథాగా పోతున్న తాగునీరు



రింగురోడ్డు సెంటరులో ..



పద్మశాలీయ కల్యాణ మండపం ఎదురు..

- రేపల్లెలో తాగునీటి పైపులైన్లకు లీకులు
- లీకులు నివారించటంలో అధికారులు విఫలం
- రోజుల తరబడి మరమ్మతులు చేయని వైనం
- పట్టణ ప్రజలకు కలుషిత నీరే దిక్కు..!

రేపల్లె రూరల్: మున్సిపల్ పైపులైన్‌లకు ఏర్పడుతున్న లీకులను నివారించటంలో అధికారులు విఫలమవుతున్నారు. పైపులైన్‌లకు లీకులు ఏర్పడి రోజులు గడుస్తున్నా మరమ్మతులు నిర్వహించక పోవటంతో వేల లీటర్ల తాగునీరు వృథాగా మురుగు నీటి పాలవుతోంది. పట్టణంలో పలుచోట్ల రోజుల తరబడి తాగునీరు లీకవుతూ నేలపాలవుతున్నా.. అధికారులకు కానరాకపోవటం విచారకరమని ప్రజాసంఘాలు విమర్శిస్తున్నాయి. లీకులతో తాగునీరు వృథాగా పోవటంతో పాటు పలు ప్రాంతాలలో కుళాయిల ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. పట్టణంలో 30 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన ప్రధాన పైపు లైన్‌లు మరమ్మతులకు గురై నిత్యం ఏదో ప్రాంతంలో లీకేజీలు ఏర్పడుతూనే ఉన్నాయి. లీకేజీలను అధికారులు గుర్తించి మరమ్మతులు నిర్వహించటంలో జాప్యం వహిస్తున్నారు. అసలే గత కొన్ని సంవత్సరాల నుంచి పట్టణ ప్రజలకు ఒక పూటే తాగునీరు సరఫరా అవుతుండటం వాటిలో లీకేజీల ద్వారా వేల లీటర్ల నీరు వృథా అవుతుండటంతో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తప్పటంలేదు. లీకేజీల వద్ద ఏర్పడిన గుంతలలో పైపులకు తాగునీరు వదిలిన సమయంలో లీకేజీల ద్వారా బయటికి పోయిన నీరు ఆపేసిన తర్వాత ఆ నీటితోపాటు మురుగు కాలువలలోని మురుగు నీరు మళ్లీ పైపుల్లోకి చేరి మరుసటి రోజు ఆ నీరే కొళాయిల ద్వారా పలు ప్రాంతాలకు సరఫరా అవుతుంది.

మరమ్మతులేవీ..?

పట్టణంలోని పలు ప్రాంతాలలో మున్సిపల్ పైపులైన్లకు ఏర్పడుతున్న లీకులు రోజులు గడుస్తున్నా మరమ్మతులకు నోచుకోవటంలేదు. పట్టణంలోని ఇండియన్ బ్యాంక్ రోడ్డు, తాలూకా సెంటర్, మార్కెట్ సెంటర్, రింగురోడ్డు సెంటర్‌లలో గత నెల రోజుల క్రితం ఏర్పడిన లీకులు నేటి వరకు మరమ్మతులకు నోచుకోలేదు. అదేవిధంగా పద్మశాలీయ కల్యాణ మండపం ఎదురు రెండు చోట్ల సుమారు సంవత్సర కాలంగా ఏర్పడిన లీకేజీని అధికారులు అరికట్టటంలో విఫలం అవుతున్నారు. ఆయా లీకుల వల్ల తాగునీరు వృథా కావటంతో నిత్యం ఆయా ప్రాంతాలలోని రహదారులపై నీరు చేరటంతో మడుగులను తలపిస్తున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి లీకేజీలకు మరమ్మతులు నిర్వహించటంతో పాటు లీకేజీల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని పట్టణ ప్రజలు, ప్రజాసంఘాల నాయకులు కోరుతున్నారు.

మరమ్మతులు నిర్వహిస్తాం..



పట్టణంలో పైప్ లైన్ల లీకుల సమస్య మా దృష్టికి వచ్చింది. ఇప్పటికే లీకులను గుర్తించాం. సిబ్బందితో లీకులను సరిచేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాం. పద్మశాలీయ కల్యాణ మండపం వద్ద విద్యుత్ స్తంభం వద్ద ఏర్పడిన లీకును సరిచేసేందుకు విద్యుత్ అధికారుల సహకారం అవసరం. అధికారులకు సమాచారం అందించాం. పట్టణంలో అన్ని ప్రాంతాలలో లీకుల సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

- కాకర్ల సాంబశివరావు, మున్సిపల్ కమిషనర్, రేపల్లె

భరతమాతకు పూజలు

నగరం: దేశభక్తిని పెంపొందించేందుకే భరతమాతకు పూజలు చేస్తున్నట్లు సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మప్రచారక్ జంజనం హేమశంకర్రావు చెప్పారు. మండలంలోని పెద్దవరం గ్రామ పంచాయతీ, రామాలయాల వద్ద గురువారం సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో భరతమాత చిత్రపటం ఏర్పాటుచేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా హేమ శంకర్రావు మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా ప్రతిగ్రామంలో భరతమాతకు పూజలు చేసి స్వాతంత్ర్య సమరయోధులు గూర్చి తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. ధర్మప్రచారక్ చింతల మురళీకృష్ణ, వాకా శ్రీనివాసరావు, సజ్జా సరస్వతి పాల్గొన్నారు.

కన్నెగంటివారిపాలెంలో...

భట్టిప్రోలు (కొల్లూరు): రిపబ్లిక్ డే పురస్కరించుకొని భరతమాతకు పూజలు చేపట్టనున్నట్లు జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు గురువారం తెలియజేశారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని కన్నెగంటివారిపాలెంలోని శ్రీరామాలయంలో పూజా కార్యక్రమాలు రిపబ్లిక్ డే వరకు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. దేశానికి స్వాతంత్రం వచ్చిన అనంతరం మన రాజ్యాంగాన్ని అమలులోకి తీసుకువచ్చిన సందర్భంగా ఈకార్యక్రమాన్ని చేపట్టామన్నారు. బోయపాటి శివప్రసాద్, బోయపాటి శ్రీనివాసరావు, కొడూరు శ్రీనివాసరావు, కన్నెగంటి నాగేశ్వరరావు, వరికూటి నాగమల్లేశ్వరరావు, చెట్టిమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం కరపత్రాలు పంపిణీ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు

తాడేపల్లి రూరల్: రైతుల సమస్యలపై విజయవాడలో ఈ నెల 17వ తేదీన నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం నాయకులు కోరారు. గురువారం తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లిలో సంబంధిత కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి కాజా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఎన్నికల వాగ్దానాలలో రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు ఇస్తానని కూటమి నాయకులు చెప్పారన్నారు. ప్రభుత్వం ఏర్పాటయ్యాక దాన్ని అమలు చేయలేదని గుర్తుచేశారు. వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేవారు. ప్రస్తుతం వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉందని పేర్కొన్నారు. రైతాంగం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం అందర్నీ ఆదుకోవాలని పేర్కొన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీలు కొనసాగించాలని, ఉచిత పంటల బీమా కొనసాగించాలని అన్నారు. పంట కాలువలలో పూడిక, తూటికాడ, గుర్రపు డెక్క తొలగించాలని తెలిపారు. శుభ్రం చేసి ఆధునికీకరించాలన్నారు. పాడి రైతులకు ఇతర రాష్ట్రాలలో ఇస్తున్న విధంగా లీటరుకు రూ.ఐదు బోనస్ అదనంగా ఇవ్వాలన్నారు. తాడేపల్లి మండలంలో అధికంగా భూమిని సాగు చేస్తున్న కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇచ్చి బ్యాంకు రుణాలు, సబ్సిడీలు అందించాలని కోరారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు విజయవాడ ధర్నా చౌక్‌లో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు అమ్మిశెట్టి రంగారావు, శివారెడ్డి, ఎనుముల సాంబయ్య, బాకీ శ్రీనివాసరావు, బత్రి వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న బూరుగ వెంకటేశ్వరరావు

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సీపీఎం తాడేపల్లి పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. గురువారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సమస్య పరిష్కారం కోసం ఐక్య పోరాటాలే మార్గమని అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కార్మికులకు నారా లోకేష్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని అన్నారు. కార్మికుల సమస్యను పరిష్కరించే దిశగా జోక్యం చేసుకుని నష్టపరిహారాన్ని అందించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడుతూ.. కార్మికుల శ్రమ దోచుకున్న యాజమాన్యం నష్ట పరిహారాన్ని ఇవ్వడంలో నిర్లక్ష్యంగా ఉందన్నారు. కార్మిక కుటుంబాలను ఇబ్బంది పెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దీక్షలలో ఎస్‌కే ఇమాంబీ, దానమ్మ, శాంతమ్మ, రమణ తదితరులు కూర్చొన్నారు. పోరాట కన్వీనర్ కూరపాటి స్టీవెన్, బి.సూర్యప్రకాష్, గురవయ్య, డి.నాగేశ్వరరావు, జయలక్ష్మి, శారమ్మ, రమదేవి, దానయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం



క్రీడా పోటీల్లో పాల్గొన్న చిన్నారులు



బహుమతులు అందజేస్తున్న అతిథులు

తాడికొండ: చిన్నారుల్లో మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయని ఫణిదరం గ్రామ సర్పంచ్ కర్నాటి బాల కోటేశ్వరరావు అన్నారు. గురువారం తాడికొండ మండలం ఫణిదరం గ్రామంలో చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్- క్రాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాల మేళా ఆటల పోటీలలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఈ సందర్భంగా బాల బాలికలకు లెమన్ అండ్ స్పూన్, లక్కీ సర్కిల్, పిరమిడ్, బెలూన్ బ్లోయింగ్, సర్కిల్‌లో బెలూన్ గేమ్, సర్కిల్ ఇన్ బాల్ గేమ్ వంటి పలు ఆటలు ఆడించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి తబిత, శాంతి, మాజీ సర్పంచ్ కర్నాటి విశ్వేశ్వరరావు, సాంబశివరావు, క్రాప్ జిల్లా కోఆర్డినేటర్ వెంకట్, జయరాజు పాల్గొన్నారు.

ముగిసిన సంక్రాంతి సంబరాలు



రేపల్లె రూరల్: సంక్రాంతి సంబరాలలో భాగంగా మండలంలోని బొందలగరువు పంచాయతీ చలపాటివారిపాలెం గ్రామంలో నిర్వహిస్తున్న వేడుకలు బుధవారం రాత్రితో ముగిశాయి. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్, లెమన్ స్పూన్ తదితర పోటీలు నిర్వహించారు. నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో ఈఓపీఆర్డీ వేగినేని దుర్గాప్రసాద్ విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు చిలుముంత శ్రీనివాసరావు, అద్దంకి నాగరాజు, వేగినేని శ్రీనివాసరావు, కేసన మురళీ, కేసన రవికుమార్, చిలుముంత రామకృష్ణ పాల్గొన్నారు.

కమీషన్ డబ్బు అడిగితే దాడి చేశారని ఫిర్యాదు

తాడికొండ: పొలం విక్రయించిన కమీషన్ డబ్బు అడిగితే నిడుముక్కల గ్రామానికి చెందిన వడ్లమూడి సాంబశివరావు తనను కులం పేరుతో దూషించి దాడి చేశారని బాధితుడు మోతడకకి చెందిన పల్లపాటి రాజేష్ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాడికొండ సీఐ కె. వాసు గురువారం తెలిపారు.

కోడి పందేలు ఆడుతున్న ఇద్దరు అరెస్టు

తాడికొండ: నిడుముక్కల డొంకలో కోడి పందేలు వేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు సీఐ కె. వాసు తెలిపారు. నిడుముక్కల నుంచి లచ్చన్నగుడిపూడి వెళ్లే డొంకలో కోడి పందేలు వేస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. కోళ్లు, నగదు స్వాధీనం చేసుకున్నారు.

కారును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

మంగళగిరి (తాడేపల్లి రూరల్) : ఎర్రబాలెం దగ్గర గురువారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఓ కారును ఆర్‌టీసీ బస్సు ఢీకొట్టడంతో కారులో ప్రయాణిస్తున్న మహిళకు గాయాలు అయ్యాయి. బాధితురాలు ఎం. సౌమ్య తెలిపిన వివరాల ప్రకారం.. తమది వైకుంఠపురమని, నాన్న మంగళగిరిలో వ్యాపారం చేస్తుంటారని తెలిపారు. ఆయన్ను కలిసేందుకు గురువారం ఉదయం 9 గంటల సమయంలో వైకుంఠపురంలోని తాత, అమ్మమ్మతో కలిసి కారులో బయలుదేరినట్లు చెప్పారు. తాత డ్రైవింగ్ చేస్తున్నారని, సుమారు ఉదయం 10 గంటల సమయంలో కృష్ణాయపాలెం, యర్రబాలెం ప్రాంతంలో ఉన్న టిడ్కో గృహ సముదాయాల వద్దకు వచ్చే సరికి ఎదురుగా ఆర్‌టీసీ బస్సు అతివేగంగా వచ్చి కారును ఢీకొట్టిందన్నారు. కారు ముందు భాగం ధ్వంసమైందని, తనకు గాయాలు కావడంతో ఆసుపత్రిలో చేర్పించారన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థినికి చేయూత



తాడేపల్లి రూరల్ : మెడిసిన్ చదువుతున్న ఓ విద్యార్థినికి దాతలు చేయూత అందించారు. విజయవాడ సిద్ధార్థ మెడికల్ కాలేజీలో రెండవ సంవత్సరం మెడిసిన్ చదువుతున్న మదీరు వర్షకు తాడేపల్లిలోని రామ్ చారిటబుల్ ట్రస్ట్, దాతలు ఊడ శివన్నారాయణ, సమ్మెట నాగ కిరణ్‌ల సహకారంతో గురువారం ఆర్థిక సహాయం అందజేశారు. రూ.1.10 లక్షల మేరకు చెక్కును అందజేసినట్లు ట్రస్ట్ ఫౌండర్ డాక్టర్ పలగాని శ్రీనివాసరావు వెల్లడించారు. సహాయమందించిన దాతలకు విద్యార్థిని వర్ష, ఆమె కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

దోమల నివారణకు ఫాగింగ్

తాడికొండ: తాడికొండ మండలం రాయపూడి గ్రామంలో దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి మల్లికార్జునరావు తెలిపారు. శీతాకాలం నేపథ్యంలో దోమలు పెరిగి రాత్రి సమయంలో ఇబ్బంది పడకుండా ఫాగింగ్ చేస్తున్నట్లు తెలిపారు.

భూముల రీ సర్వేపై ర్యాలీ



వరహాపురంలో భూ రీ సర్వేపై ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దార్ సుశీల, రెవెన్యూ సిబ్బంది

వరహాపురం(వేమూరు): రైతులకు తమ భూములకు సంబంధించి విభేదాలు ఉంటే రీ సర్వే ద్వారా పరిష్కారం చేయడం జరుగుతుందని తహసీల్దార్ సుశీల అన్నారు. వేమూరు మండలంలోని వరహాపురం గ్రామంలో భూ రీసర్వేపై గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేమూరు మండలంలోని వరహాపురం గ్రామం భూరీసర్వే కింద కేటాయించడం జరిగిందన్నారు. గ్రామంలో రైతులు భూములు రీ సర్వే చేసి పొలాల్లో హద్దు రాళ్ల వేయడం జరుగుతుందన్నారు. రైతులందరు పూర్తిగా సహకరించాలని ఆమె కోరారు. గత ప్రభుత్వంలో పులిచింత పాలెం గ్రామంలో రీ సర్వే చేసి భూములకు హద్దు రాళ్ల వేయడం జరిగిందన్నారు. అదేవిధంగా వరహాపురం గ్రామంలో హద్దులు వేయడం జరుగుతుందన్నారు. రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మండూరులో...

చుండూరు(వేమూరు): రైతుల భూములకు భూ సర్వే ద్వారా పూర్తి హక్కులు కల్పించడం జరుగుతుందని తహసీల్దార్ నాగరాజు అన్నారు. చుండూరు మండలంలోని మండూరు గ్రామంలో భూ రీసర్వేపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండూరు గ్రామంలో భూములను రీ సర్వే ద్వారా భూములకు పూర్తి హక్కులు కల్పించి హద్దుల వద్ద రాళ్ల వేయడం జరుగుతుందన్నారు. రైతులందరు ముందుకు వచ్చి భూ రీసర్వేకు సహకరించాలని ఆయన కోరారు. రైతులకు అవగాహన కల్పించేందుకు ర్యాలీలు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరరావు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కోడి తాడిపర్రులో...

అమర్తలూరు(వేమూరు): భూములు రీ సర్వేకు రైతులందరు ముందుకు రావాలని తహసీల్దార్ నెహ్రూ అన్నారు. అమర్తలూరు మండలంలోని కోడి తాడిపర్రు గ్రామంలో భూ రీసర్వేపై గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నెహ్రూ మాట్లాడుతూ ప్రభుత్వం భూ రీ సర్వేకు కోడి తాడిపర్రు గ్రామాన్ని ఎంపికచేయడం జరిగిందన్నారు. రైతుల భూములను ప్రభుత్వం సర్వే చేసి హద్దుల్లో రాళ్ల వేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. పొలాలు హద్దులు వద్ద విభేదాలు ఉంటే రీ సర్వే ద్వారా పరిష్కారం చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. డెప్యూటీ తహసీల్దారు శివయ్య, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వీఆర్ఓ మృతి



తోడేటి రత్నాకరరావు (ఫైల్)

కొల్లూరు: గుండెపోటుకు గురై వీఆర్ఓ మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మండలంలోని చింతర్లంకకు చెందిన తోడేటి రత్నాకరరావు (48) గతంలో కొల్లూరు మండలంలో వీఆర్ఏగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి, పదోన్నతిపై భట్టిప్రోలు మండలం ఐలవరంలో వీఆర్ఓగా విధులు నిర్వహిస్తున్నాడు. కొన్ని నెలల క్రితం అతను అనారోగ్యానికి గురవడంతో గుండె సంబంధిత వ్యాధిగా గుర్తించిన వైద్యులు స్టంట్‌లు వేశారు. అయితే సంక్రాంతి పండుగ పురస్కరించుకొని తన అత్తగారి ఊరైన కొప్పరావూరుకు భార్య, పిల్లలతో కలసి వెళ్లాడు. బుధవారం సాయంత్రం అకస్మాత్తుగా గుండెల్లో నొప్పిగా ఉందనడంతో బంధువులు మంగళగిరిలోని ఎన్ఆర్ఐ వైద్యశాలకు తరలించారు. వైద్యశాలలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో గుండెపోటుతో మృతి చెందాడు. రత్నాకరరావు మృతదేహాన్ని బుధవారం అర్ధరాత్రి అతని స్వగ్రామమైన చింతర్లంకకు బంధువులు తరలించారు. రత్నాకరరావు మృతి విషయం తెలుసుకున్న కొల్లూరు, భట్టిప్రోలు మండలాలకు చెందిన పలువురు రెవెన్యు అధికారులు, సిబ్బంది మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అతని కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

కొల్లూరు విద్యార్థినికి మాజీ డీజీపీ ప్రతిభా అవార్డు



కొల్లూరులో విద్యార్థిని ప్రేమకీర్తనకు అవార్డు ఎంపిక పత్రం అందజేస్తున్న యాక్ట్ సంస్థ ప్రతినిధులు

కొల్లూరు: పదో తరగతి వార్షిక పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి బాలికోన్నత పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థినికి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల మాజీ డీజీపీ ప్రతిభా అవార్డుకు ఎంపిక చేసినట్లు అంబేడ్కర్ చారిటబుల్ ట్రస్ట్ (యాక్ట్) వ్యవస్థాపకులు ఆళ్లమూడి ప్రభాకరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కొల్లూరు హైస్కూల్‌లో 6 నుంచి 10 వరకు విద్యాభ్యాసం చేసిన మాజీ ఐపీఎస్ డాక్టర్ బయ్యారపు ప్రసాదరావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు మాజీ డీజీపీగా పనిచేశారని, ఆయన పేరుమీద ప్రతిభా అవార్డులు అందజేయడం తమ సంస్థకు గర్వకారణమన్నారు. 2024 పదోతరగతి వార్షిక పరీక్షలలో కొల్లూరు బాలికోన్నత పాఠశాలల్లో అత్యధిక మార్కులతో ప్రథమస్థానంలో నిలిచిన కొలకలూరి ప్రేమకీర్తనను ఈఏడాది పతిభా అవార్డుకు ఎంపిక చేసినట్లు ప్రకటించారు. ఈసందర్భంగా విద్యార్థిని ప్రేమకీర్తనకు యాక్ట్ వ్యవస్థాపకుడు ఆళ్లమూడి ప్రభాకరరావు, ప్రతినిధి అత్తోట ప్రమోద్ చేతుల మీదుగా ప్రతిభా అవార్డు ఎంపిక పత్రాన్ని అందజేశారు.

కొనసాగుతున్న సాగర్ నీటి విడుదల

మిర్చి పంటకు నీటి తడులు వేస్తున్న అన్నదాతలు



సాగర్ కాల్వలో పారుతున్న నీరు

తాడికొండ: గత వారం రోజులుగా సాగర్ కాల్వలకు నీటి విడుదల కొనసాగుతోంది. దీంతో రైతులు తమ పంట పొలాలకు నీటి తడులు వేసుకునే ప్రక్రియ చేపట్టారు. తాడికొండ మండలం పరిధిలోని రావెల, బండారుపల్లి, ఫణిదరం, గరికపాడు, దామరపల్లి, పొన్నెకల్లు, పాములపాడు, బేజాత్పురం, మోతడక, నిడుముక్కల, ముక్కామల, లచ్చన్నగుడిపూడి గ్రామాల పరిధిలో ఈ ఏడాది మిర్చి సాగు చేస్తున్న రైతులకు ప్రస్తుత పరిస్థితుల్లో ఇది ప్రయోజనకరంగా మారింది. ఇప్పటికే 50 శాతం పంట పొలాలకు రైతులు నీటి తడులు అందించారు. శివారు ప్రాంతాల్లో ఉన్న పంటలన్నింటికీ నీరు పెట్టడం పూర్తయ్యేంతవరకు నీటి విడుదల కొనసాగించాలని పలువురు రైతులు కోరుతున్నారు. 2 నెలలుగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ప్రస్తుతం రైతులకు నీటి అవసరాలు ఉన్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకొని సాగర్ కాల్వలకు నీటి విడుదలను కొనసాగించాలని అన్నదాతలు కోరుతున్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులు అందిస్తున్న వేణుగోపాల్, మాధవరావు

ఫిరంగిపురం: మండలంలోని పొనుగుపాడు గ్రామంలో సంక్రాంతి సంబరాలు సందర్భంగా గురువారం పలురకాల ఆటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో 150 మంది వరకు బాలబాలికలు పాల్గొన్నారు. వారికి ముగ్గులపోటీ, మ్యూజికల్ చైర్స్, బైక్‌స్లో, రన్నింగ్, డాన్స్, స్పూన్‌పోటీ, స్కిప్పింగ్ వంటి పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి హైకోర్టు లాయర్ టి.వేణుగోపాల్, మిత్ర ఫౌండేషన్ కమిటీ చైర్మన్ ఎ. మాధవరావులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎ. వెంకట్రావు, యామిని బ్రహ్మం, షేక్.జవహర్, షేక్.మస్తాన్ వలి, కె.బాబి, కె.భార్గవ్, రామకిరణ్, తేజ, చంద్రశేఖర్, కె.రాజేష్, కార్తికేయ శ్రీనివాసరావు, త్రివేణి, తెలుగు యువత నాయకులు పాల్గొన్నారు.